క్లుప్తంగా

అలరించిన విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

సిరిసిల్లటౌన్: సిరిసిల్లలోని 'సహస్ర' జూనియర్ కళాశాల వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఫంక్షన్ హాల్‌లో 'సహస్ర ప్రగ్యాన్ 2024' పేరుతో నిర్వహించిన కార్యక్రమం అలరించింది. ముఖ్య అతిథిగా టౌన్ సీఐ ఉపేందర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కళాశాల ప్రిన్సిపాల్ సిద్దిరాల శ్రీనివాస్, డైరెక్టర్లు పెండెం పవన్‌కుమార్, నరేశ్ కుమార్, కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.

నియామకం


నియామకపత్రం అందిస్తున్న నాయకులు

బోయినపల్లి(చొప్పదండి): కాంగ్రెస్ ఎస్సీసెల్ జిల్లా సంయుక్త కార్యదర్శిగా మండలంలోని మల్లాపూర్ గ్రామానికి చెందిన గొర్రె కిషన్‌ను నియమిస్తున్నట్లు కాంగ్రెస్ ఎస్సీసెల్ జిల్లా చైర్మన్ ఆకునూరి బాలరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తన నియామకానికి సహకరించిన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఆది శ్రీనివాస్, చైర్మన్ ఆకునూరి బాలరాజు, నాయకులు కూస రవీందర్, వన్నెల రమణారెడ్డి, బి.మహేశ్‌రెడ్డి, వేసిరెడ్డి దుర్గారెడ్డి, రామిడి శ్రీనివాస్, నంది సంపత్‌కుమార్ తదితరులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులకు స్నాక్స్ పంపిణీ


స్నాక్స్ అందిస్తున్న ఉపాధ్యాయులు

గంభీరావుపేట: మండలంలోని ముచ్చర్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థుకు స్టడీ అవర్స్‌లో స్నాక్స్ అందించేందుకు అదే పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న మిర్యాల్‌కార్ శివకుమార్ ఆర్థికసాయం అందించాడు. దీంతో సోమవారం నుంచి గోరుముద్ద కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు స్నాక్స్ పంపిణీ ప్రారంభించారు. ఉపాధ్యాయున్ని తల్లిదండ్రులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలకు ఇసుక అనుమతులివ్వాలి

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలో నిరుపేదలు ఇళ్లు నిర్మించుకుంటే అధికారులు ఇసుక తరలింపుకు ప్రభుత్వపరంగా అనుమతులు ఇవ్వాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య అన్నారు. సోమవారం మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. పేదలు ఇల్లు నిర్మించుకుంటే ఇసుక అందుబాటులో ఉంటుందన్నారు. ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలకు ఇసుకను అనుమతించాలని కోరారు. సమావేశంలో మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, నాయకులు గౌస్, లింగంగౌడ్, గిరిధర్ రెడ్డి, వంగ మల్లారెడ్డి, రామచంద్రం, రఫిక్, రాజేందర్, రవి, బుచ్చాగౌడ్, బాబు, తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనాల తనిఖీ

వేములవాడఅర్బన్: పట్టణంలో ద్విచక్రవాహనాల ప్రత్యేక తనిఖీ నిర్వహించినట్లు వేములవాడ ట్రాఫిక్ ఎస్సై దిలీప్ కుమార్ తెలిపారు. ద్విచక్రవాహనదారులు నెంబర్ ప్లేట్ అమర్చాలన్నారు. నెంబర్ ప్లేట్ లేని వాహనాలపై చర్యలు తీసుకుంటామన్నారు. కొన్ని ద్విచక్ర వాహనాలకు నెంబర్ ప్లేట్‌లను వేయించారు.

బాల్యవివాహాలపై అవగాహన

ముస్తాబాద్: బాల్య వివాహలతో అనేక అనర్థాలు జరుగుతాయని ఎస్సై శేఖర్‌రెడ్డి అన్నారు. మండలంలోని నామాపూర్ జగదాంబతండాలో బాల్య వివాహలపై గిరిజనులకు సోమవారం అవగాహన కల్పించారు. ప్రభుత్వం విద్యాభివృద్ధికి ఎన్నో పథకాలు ప్రవేశపెట్టిందని,తండాల్లో ప్రతి ఒక్కరూ చదువుకునేలా సహకరించాలన్నారు. 18 ఏళ్లు దాటిన వారికి మా త్రమే వివాహాలు జరిపించాలన్నారు. శ్రీనివాస్, గౌతమి పాల్గొన్నారు.

వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర

వీర్నపల్లి: మండలంలోని సీతారాంనాయక్ తండాలో మంగళవారం వికసిత్ భారత్ సంకల్ప యాత్రను సర్పంచ్ భానోత్ రవి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో జరుగుతున్న ఉపాధిహామీ, వైద్యం, విద్య, వ్యవసాయం, అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివిధ శాఖ అధికారులు పథకాల గురించి ప్రజలకు వివరించారు. అనంతరం ప్రతిజ్ఞ, క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యదర్శి కుమార్, అధికారులు పాల్గొన్నారు.


పంటపొలంలో ఉన్న గిరిజన మహిళా రైతు ఎల్లారెడ్డిపేట మండలంలోని గుంటపల్లి చెరువుతండాకు చెందిన మాలోతు లలిత. ప్రభుత్వం అందించిన పోడు పట్టాతో తనకు వచ్చిన రెండెకరాల్లో వరి పంట సాగుచేసింది. గతంలోనూ అదే భూమిలో పంటలు సాగు చేసినా పట్టాలు లేక భయం భయంగా పనులు చేసేది. ఇప్పుడు పోడుపట్టా రావడంతో సొంత భూమిలో దర్జాగా పంట సాగుచేస్తోంది.


మండలంలోని గుంటపల్లి చెరువుతండాకు చెందిన ఈ రైతుపేరు నునావత్ రాజు. రెండున్నర ఎకరాల్లో అడవిని చదును చేస్తూ దశాబ్దకాలంగా పంటలు సాగు చేసేవాడు. అటవీ అధికారుల వేధింపులతో ఇబ్బందులకు గురయ్యాడు. కొంతకాలం సాగును నిలిపివేశాడు. పోడుపట్టాల పంపిణీలో భాగంగా రాజుకు రెండున్నర ఎకరాలకు హక్కుపత్రాలు అందించింది. ఇప్పుడు ఆనందంగా పంటలు సాగుచేస్తున్నాడు.


ఈమె గుంటపల్లి చెరువుతండాకు చెందిన గిరిజన మహిళా రైతు మాలోతు మంజుల. వ్యవసాయ భూమి లేక కూలీ పనిచేస్తూ జీనవం సాగించేది. తండాలో అందరిలాగే ఎకరం అటవి భూమిని చదును చేసి అందులో పంట పండించేది. పోడుపట్టాల పంపిణీలో భాగంగా ఎకరం భూమికి మాజీమంత్రి, ఎమ్మెల్యే కేటీఆర్ చేతులమీదుగా పట్టా అందుకొని పంట సాగుచేస్తోంది.

తండాల్లో సాగు సంబరం


పోడు భూమిలో సాగుచేసిన వరి


పొలంలో నారు తీస్తున్న రైతులు

- నెరవేరిన దశాబ్దాల కల
- దర్జాగా పోడు భూముల్లో సాగు
- 2,858 ఎకరాల్లో పచ్చని పైర్లు
- ఆనందంలో పోడు రైతులు

ఎల్లారెడ్డిపేట: దశాబ్దాలుగా పోడుపట్టాల కోసం ఎదురుచూసిన గిరిజనుల ఆశలు ఎట్టకేలకు నెరవేరాయి. అటవీ భూములు ఆక్రమించి సాగు చేస్తున్నారని ఫారెస్ట్ అధికారులు పోడురైతుల మధ్య ఎన్నో సందర్భాల్లో కేసులపాలైన సంఘటనలున్నాయి. ఇలాంటి సమస్యలను పరిష్కరించేందుకు పోడు భూములు సాగుచేసుకుంటున్న వారికే పట్టాలు ఇవ్వాలని గత ప్రభుత్వం నిర్ణయించగా పట్టాలు అందుకున్న రైతులు నేడు దర్జాగా పంటలు సాగుచేస్తున్నారు. మొన్నటివరకు భయంభయంగా భూములు సాగుచేసుకున్న గిరిజన రైతుల్లో నేడు సాగు సంబురం కనిపిస్తోంది. ఏ తండాకు వెళ్లినా పోడుభూముల్లో పచ్చని వరిపైర్లు కనిపిస్తున్నాయి.

1614 మంది రైతులు.. 2,858 ఎకరాలు

జిల్లావ్యాప్తంగా 62 గ్రామాల్లో పోడు భూములు సాగుచేసుకుంటున్న 1,614 మంది రైతులకు బీఆర్ఎస్ ప్రభుత్వం 2,858 ఎకరాలకు పట్టాలు అందించింది. దశాబ్దాలుగా గిరిజన రైతులు సాగు చేసుకుంటుండగా హక్కుపత్రాలు లేక ఇన్నిరోజులు ఇబ్బందులుపడ్డారు. వేసిన పంట చేతికొస్తుందో లేదోనన్న పరిస్థితి కనిపించేది. ప్రభుత్వం అర్హులను గుర్తించి పోడు పట్టాలు అందించడంతో నేడు ధైర్యంగా పంటలు సాగుచేసుకుంటున్నారు. దీనికి తోడు పోడు రైతులకు చేయూతనివ్వాలనే సంకల్పంతో బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుబంధును వర్తింపజేయడంతో సాగు పెట్టుబడులు అందాయి. రైతుబీమా కూడా వర్తిస్తుండటంతో వారి కుటుంబీకులు మనోధైర్యంతో జీవిస్తున్నారు.

పోడు రైతులకు భరోసా


పోడు భూములు సాగు చేస్తున్న గిరిజన రైతులు ఎన్నో ఇబ్బందులుపడ్డారు. సాగు చేస్తున్న భూములకు హక్కుపత్రాలు లేక ఇన్నిరోజులు ఎదురుచూశారు. తెలంగాణ ప్రభుత్వం మారుమూల తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చి గిరిజనుల గూడేల్లో వెలుగులు నింపింది. పోడు రైతులకు పట్టాలు ఇచ్చి వారి బతుకులకు భరోసానిచ్చింది.
– మాలోతు సునీత, గుంటపల్లి చెరువుతండా

వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు


ఆలయంలో మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

ఎల్లారెడ్డిపేట: సిద్దిపేట జిల్లా దుబ్బాకలోని శ్రీ వేంకటేశ్వరస్వామిని మండలకేంద్రంలోని శ్రీ వేణుగోపాలస్వామి ఆలయానికి చెందిన గోదాగోష్టి బృందం సభ్యులు సోమవారం దర్శించుకొని పూజలు చేశారు. సర్పంచ్ నేవూరి వెంకట్‌రెడ్డి సొంత ఖర్చులతో బస్సు, ఇతర సౌకర్యాలు కల్పించారు. ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా 80 మంది గోదాగోష్టి సభ్యులు తరలివెళ్లారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


బాబు (ఫైల్)

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలంలోని అంకుషాపూర్‌కు చెందిన కోడి బాబు(35) సోమవారం చికిత్స పొందుతూ మృతిచెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాలు. కోడి బాబు పది రోజుల క్రితం శివారులో రోడ్డు ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం కన్నుమూశాడు. చికిత్సకు రూ.12 లక్షల వరకు ఖర్చు అయ్యింది. మృతుడికి భార్య మమత, ఇద్దరు కూతుళ్లు లక్ష్మీప్రసన్న(9), మనస్విని(7) ఉన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ధర్నాలతో దద్దరిల్లిన కలెక్టరేట్

సిరిసిల్లటౌన్: ధర్నాలు.. నిరసనలతో సోమవారం జిల్లా కలెక్టరేట్ దద్దరిల్లింది. కార్మిక సంఘాలు, ప్రజాసంఘాలు, వివిధ పార్టీల ఆధ్వర్యంలో నిరసనలు తెలిపారు. పలు సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రాలు అందజేశారు.

క్రీడా ప్రాంగణాలు పూర్తి చేయాలి


గ్రామాల్లో క్రీడాప్రాంగణాలు అసంపూర్తిగా ఉన్నాయని వెంటనే వాటిని పూర్తి చేయాలని లంబాడి హక్కుల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు నరేశ్‌నాయక్ డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేయించి వదిలేసిందన్నారు. తిరిగి వాటిని పునర్నిర్మించి విద్యార్థులకు అందుబాటులోకి తేవాలన్నారు. క్రీడలకు మౌలిక వసతులు కల్పించాలని, సామగ్రిని సమకూర్చాలని కోరుతూ అడిషనల్ కలెక్టర్లు గౌతమికి వినతిపత్రం అందించారు. మోహన్‌నాయక్, రమేశ్ నాయక్, ప్రశాంత్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి


మధ్యాహ్న భోజన కార్మికులకు ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పించాలని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి గుంటి వేణు డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన వర్కర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడించి మాట్లాడారు. పీఎస్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. విధుల నిర్వహణలో ప్రమాదాలకు, గాయాల పాలైన వారికి నష్టపరిహారం చెల్లించాలన్నారు. ప్రభుత్వమే నిత్యవసరాలు, గ్యాస్, కోడిగుడ్లు సరఫరా చేయాలని, కలెక్టరేట్‌లో వినతిపత్రం అందించారు. నాయకులు జుబేదా, సాయిలు, రాజవ్వ, మనమ్మ, లక్ష్మి, నర్సవ్వ, రాజేశ్వరి, సునీత తదితరులు పాల్గొన్నారు.

డీలర్ లైసెన్స్ రద్దు చేయండి

అక్రమంగా బియ్యం తరలిస్తూ..పట్టుబడిన రేషన్ డీలర్ లైసెన్సును రద్దు చేయాలని సిరిసిల్ల పదోవార్డు కౌన్సిలర్ బొల్గం నాగరాజు గౌడ్ కోరారు. సోమవారం జిల్లా అడిషనల్ కలెక్టర్ ఖీమ్యానాయక్‌ను గ్రామస్తులతో కలిసి వినతిపత్రం అందించి మాట్లాడారు. గతంలో పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా విక్రయిస్తూ పట్టుబడిన గ్రామానికి చెందిన రేషన్ డీలర్‌ను తాత్కాలికంగా నిలిపివేసి తిరిగి వా రికే కట్టబెట్టారన్నారు. సదరు డీలర్ లై సెన్స్‌ను రద్దు చేసి కొత్తవారికి అప్పగించాలని కోరారు.

కార్మికులకు లేబర్ కార్డులు అందించండి

భవన నిర్మాణ కార్మికులు ప్రభుత్వం అమలు చేసే వివిధ సంక్షేమ పథకాలు పొందేందుకు లేబర్ కార్డులు అందించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా గాజుల పోశెట్టి అన్నారు. సోమవారం కలెక్టరేట్ వద్ద కార్మికులతో కలిసి వచ్చి ధర్నా చేపట్టారు. యాభై ఏళ్లు నిండిన కార్మికులకు నెలకు రూ.5వేలు పింఛన్ అందించాలని, ప్రమాదవశాత్తు మృతిచెందిన వారికి రూ.10లక్షలు, సహజయంగా మరణిస్తే రూ.5లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. ప్రధాన కార్యదర్శి కడారి రాములు, అజ్జ వేణు, బొల్లె బాబు, శీలం నర్సయ్య తదితరులున్నారు.

సర్పంచ్‌పై చర్యలు తీసుకోవాలి


చింతల్‌ఠాణా ఆర్‌అండ్ఆర్‌కాలనీ గ్రామ పంచాయతీ సర్పంచ్ తీరుపై గ్రామస్తులు నిరసన వ్యక్తంచేశారు. కాంగ్రెస్ నాయకుడు చొక్కాల రాము ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేయగా ఆయన మాట్లాడారు. జీపీ నిధులకు సంబంధించిన ఖర్చులు అడిగితే దురుసుగా ప్రవర్తిస్తున్నట్లు వెల్లడించారు. జీపీ నిధుల్లో అక్రమాలు జరగకుండా చూడాలని అడిషనల్ కలెక్టర్ ఖీమ్యానాయక్‌కు కోరారు.

విద్యాభివృద్ధిలో ఉపాధ్యాయులే కీలకం

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఆది శ్రీనివాస్

సిరిసిల్లటౌన్: విద్యాభివృద్ధిలో ఉపాధ్యాయులు కీలకమని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. సోమవారం టీపీటీఎఫ్ క్యాలెండర్లను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ప్రభుత్వ బడులను రాష్ట్ర సర్కారు బలోపేతం చేస్తోందన్నారు. ఉపాధ్యాయుల సమస్యలన్నీ పరిష్కరిస్తామని హామీఇచ్చారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాతూరి మహేందర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు దోర్నాల భూపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి దుమాల రమనాథ్ రెడ్డి, పూరెల్లి రవీందర్, వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

వడ్డెరుల హక్కులు కాపాడాలి

తమ హక్కులను సర్కారు కాపాడాలని వడ్డెరుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు సూర దేవరాజు కోరారు. ఈమేరకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను కలిసి వినతిపత్రం అందించి, మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో వడ్డెరుల హక్కులను అణగదొక్కిందని ఆరోపించారు. జిల్లాలో తమకు కమ్యూనిటీ భవన నిర్మాణానికి రెండెకరాల స్థలం కేటాయించాలని కోరారు. రమేశ్, తిరుపతి పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం

జిల్లా వడ్డెర హక్కుల పోరాట సమితి అధ్యక్షుడిగా గోగుల రమేశ్, వేములవాడ ఇన్‌చార్జిగా దండుగుల తిరుపతి, జిల్లా ఉపాధ్యక్షుడిగా శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా యాపకాయల సతీశ్, కార్యదర్శిగా బత్తుల అశోక్ నియమితులయ్యారు.

వేములవాడఅర్బన్: సెస్ సేవలు బాగున్నాయని, వ్యవసాయానికి సైతం నాణ్యమైన సేవలు అందించాలని వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కోరారు. వేములవాడలో సెస్ కార్యాలయాన్ని ప్రారంభించి మాట్లాడారు. నూతన పాలక వర్గం పాలనను గాడిలో పెట్టినప్పటికీ అవకతవకలపై కఠినంగా వ్యవహరించాలన్నారు. ప్రభుత్వపరంగా సెస్‌కు కావాల్సిన సహాయ సహకారాలు అందించడానికి సిద్ధంగా ఉంటానన్నారు. పెరిగిన వినియోగం దృష్ట్యా సబ్‌స్టేషన్‌ల ఏర్పాటు అవసరమని, ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, సెస్ వైస్‌చైర్మన్ దేవరకొండ తిరుపతి, ఎండీ రామకృష్ణ, డీఈ శ్రీనివాస్, ఏడీలు శ్రీధర్, రమేశ్, సెస్ డైరెక్టర్లు నామాల ఉమ, రేగులపాటి హరిచరణ్‌రావు, ఆకుల దేవరాజం ఉన్నారు.

అయోధ్య రాముడి అక్షింతలతో శోభాయాత్ర


ముస్తాబాద్: నామాపూర్‌లో అక్షింతలతో భక్తుల శోభాయాత్ర


బోయినపల్లి: కోరెంలో శోభాయాత్రలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్సీ చెన్నాడి సుధాకర్‌రావు

సిరిసిల్ల టౌన్: అయోధ్య రాముడి అక్షింతలను సోమవారం సిరిసిల్లలో పంపిణీ చేశారు. 28వ వార్డులో కౌన్సిలర్ పత్తిపాక పద్మ నేతృత్వంలో ఇంటింటికీ అక్షితలు అందించారు. జిల్లామహిళా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి చందన, శోభ, అరుణ పాల్గొన్నారు.

బోయినపల్లి(చొప్పదండి): మండలంలోని స్తంభంపల్లి, బోయినపల్లి, కోరెం, అనంతపల్లి, కొత్తపేట గ్రామాల్లో అయోధ్య రాముడి అక్షింతల శోభాయాత్ర నిర్వహించారు. అయాగ్రామాల్లోని ఆలయాల్లో పూజలు నిర్వహించిన అనంతరం శోభాయాత్ర నిర్వహించారు. కోరెంలో నిర్వహించిన శోభాయాత్రలో మాజీ ఎమ్మెల్సీ చెన్నాడి సుధాకర్‌రావు పాల్గొన్నారు. బోయినపల్లిలో మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికి అక్షింతలు తీసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచులు చెన్నాడి రాజ్యలక్ష్మి, గుంటి లతశ్రీ, అక్కెనపెల్లి జ్యోతి, ల్యాద నవిత, వంగపల్లి సత్యనారాయణరెడ్డి, కోరెం సింగిల్‌విండో చైర్మన్ తీపిరెడ్డి కిషన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట (సిరిసిల్ల): మండలంలోని వెంకటాపూర్, కోరుట్లపేటలో రాములోరి అక్షింతలతో శోభాయాత్ర నిర్వహించారు. శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో అక్షింతలకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామంలోని ఇంటింటా అక్షింతలు పంపిణీ చేశారు. సర్పంచులు కోల అంజమ్మ, దేవానందం, వేదపండితులు పాల్గొన్నారు.

నామాపూర్‌లో

ముస్తాబాద్: మండలంలోని నామాపూర్‌లో అయోధ్య భవ్య రామమందిర అక్షింతలతో శోభయాత్ర నిర్వహించారు. ఇంటింటికి అక్షింతలను అందజేశారు. మహిళలు మంగళహారతులతో అక్షింతలను ఇండ్లలోకి తీసుకెళ్లారు. హనుమాన్, శివాలయాలలో ప్రత్యేక పూజలు చేశారు.

జిల్లాస్థాయి ఉపన్యాస పోటీలు

- జిల్లా యువజన అధికారి వెంకట్ రాంబాబు

సిరిసిల్ల: జిల్లాలో నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో జిల్లాస్థాయి ఉపన్యాస పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన అధికారి వెంకట్ రాంబాబు సోమవారం తెలిపారు. యువజన మరియు క్రీడల మంత్రిత్వశాఖ జిల్లాస్థాయి ఉపన్యాస (డిక్లమేషన్) పోటీలు ఈనెల 10న తంగళ్లపల్లిలోని ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజీలో నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఉదయం 10 గంటలకు మై భారత్– వికసిత భారత్– 2047 అనే అంశంపై జిల్లా స్థాయి ఉపన్యాస పోటీ ఉంటుందని పేర్కొన్నారు. 15–29 ఏళ్ల వయసు గల వారు కేవలం 7 నిమిషాల వికసిత భారత్ అంశంపై ఇంగ్లిష్, హిందీ, తెలుగు భాషల్లో ప్రసంగించాల్సి ఉంటుందని వివరించారు. జిల్లాస్థాయి విజేతలకు ప్రశంసాపత్రం, జ్ఞాపిక అందిస్తామని వివరించారు. రాష్ట్రస్థాయిలో మొదటి బహుమతి రూ.లక్ష, రెండో బహుమతి రూ.50వేలు, మూడో బహుమతి రూ.25వేలు ఇద్దరికి అందిస్తారని తెలిపారు.

'దేవాలయ నిధులు కాపాడాలి'


వినతిపత్రం అందిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

చందుర్తి(వేములవాడ): మండలంలోని నర్సింగాపూర్ మోహినికుంట శ్రీ మల్లికార్జున స్వామి దేవాలయాల నిధులు, ఆస్తులను కాపాడాలని కోరుతూ గ్రామ ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ఉపసర్పంచ్ కాసర్ల శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో దేవాదాయ, ధర్మశాఖ అసిస్టెంట్ కమిషనర్ (ఏసీ) చంద్రశేఖర్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. 30 ఏళ్లుగా ఆలయ పూజారులుగా కొనసాగుతున్న ఒగ్గు కళాకారులు స్వామివారి కట్న కానుకలతో పాటు హుండీ ఆదాయాన్ని తీసుకుంటున్నారన్నారు. ఆలయంలో మౌలిక సదుపాయాల ఏర్పాటుకు నిధులు లేకపోవడంతో వసతుల కల్పన కష్టంగా మారుతోందన్నారు. ఆలయం పేరిట ఉన్న 20గుంటల భూమిని పూజారి గుట్టుగా విక్రయించారని, ఆలయంలో జరుగుతున్న అక్రమాలపై అధికారులు చర్యలు చేపట్టి దేవాలయ నిధులను, ఆస్తులను కాపాడాలని కోరారు.

ఆన్‌లైన్‌లో ప్రజాపాలన దరఖాస్తులు


వేములవాడరూరల్: ప్రజాపాలన దరఖాస్తులను ఉద్యోగులు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. ఈనెల 17వరకు ఆన్‌లైన్‌లో పూర్తిచేయాలని ప్రభుత్వం గడువు ఇచ్చింది. దీంతో అన్నిశాఖల అధికారులు దరఖాస్తులను నమోదు చేయడంలో నిమగ్నమయ్యారు. మండల పరిషత్ కార్యాలయంలో తహసీల్దార్ సుజాత దరఖాస్తులను సోమవారం పరిశీలించారు.

వీర్నపల్లి: ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులను పారదర్శకంగా ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నట్లు ఎంపీడీవో నరేశ్‌కుమార్ తెలిపారు. మండలంలో 4147 దరఖాస్తులు రాగా, ఇప్పటివరకు 1500 దరఖాస్తులు ఆన్‌లైన్ చేసినట్లు తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడితే చర్యలు

సిరిసిల్లక్రైం: సిరిసిల్ల పట్టణ పరిధిలో పది రోజుల్లో నిర్వహించిన డ్రంకెన్‌డ్రైవ్‌లో 42 మందికి జరిమానాలు విధిస్తూ సిరిసిల్ల న్యాయమూర్తి ప్రవీణ్ సోమవారం తీర్పునిచ్చారు. సిరిసిల్ల టౌన్ సీఐ ఉపేందర్ తెలిపిన వివరాలు. 18 మందికి ఒక రోజు జైలు, రూ.3వేలు జరిమానా విధించగా, ఐదుగురికి రెండు రోజుల జైలు, రూ.3వేల జరిమానా మరో 19 మందికి రూ.3 వేల జరిమానాలు విధించినట్లు తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడడం వంటి వాటిపై సీరియస్‌గా వ్యవహరించనున్నట్లు వెల్లడించారు. పలుమార్లు కేసుల్లో ఉండే ఉద్యోగ, డ్రైవింగ్ లైసెన్స్ మంజూరీలో ఇబ్బందులు వస్తాయని తెలిపారు. పలువురి కౌన్సిలింగ్ నిర్వహించారు.

నేడు మండల సమావేశం

బోయినపల్లి: మండల సర్వసభ్య సమావేశం మంగళవారం ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్ అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో నల్లా రాజేందర్‌రెడ్డి తెలిపారు. ఆయా శాఖల అధికారులు తమశాఖల ప్రగతి నివేదికలతో సకాలంలో హాజరు కావాలని ఎంపీడీవో కోరారు.